జోరుగా ఇసుక అక్రమ రవాణా!

- పాలేరు వాగు నుంచి అనుమతులు లేకుండా తరలిస్తున్న దళారులు
- ఏపీ నుంచి కూడా రవాణా
- రెండు నెలల వ్యవధిలో 11 ట్రాకర్లు స్వాధీనం



అనంతగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

అనంతగిరి : మండలంలోని పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా తెలంగాణకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టి ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఈ ఇసుక దందా ఆగడం లేదు. గత రెండు నెలల వ్యవధిలో అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 11 ఇసుక ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవే ఎక్కువగా ఉన్నాయి.

సెలవు రోజుల్లోనూ తరలింపు..

సెలవు రోజుల్లోనూ ఇసుక దళారులు రెచ్చిపోతున్నారు. సాధారణంగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా సెలవు రోజుల్లో ఇసుక సరఫరాకు అనుమతులు ఉండవు. కానీ ఆదివారాల్లో కూడా దళారులు ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. దళారులు నాణ్యతను బట్టి ఒక్కో ట్రక్కు ఇసుకను రూ.5 నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే ఇటీవల పాలేరు వాగులో తవ్వకాలు జరుపుతుండగా రెవెన్యూ అధికారులు వాగు సమీపంలోకి చేరుకునేలోపు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ముఠాలు ట్రాక్టర్లతో సహా పారిపోయినట్లు తెలిసింది.

ఇళ్ల నిర్మాణానికి అనుమతులు..

నూతన మండలం ఏర్పడిన తొలినాళ్లలో మైనింగ్ అధికారులు.. పాలేరు వాగులోని ఇసుకను పరిశీలించి భవనాలు, ఇళ్ల నిర్మాణాలకు అనువుగా లేదంటూ రిపోర్ట్ ఇచ్చారు. ఆ తర్వాత గత ప్రభుత్వంలోనే పాలేరు వాగు ఇసుకను పరిశీలించిన రెవెన్యూ శాఖ అధికారులు ఆ ఇసుక.. కేవలం ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు మాత్రమే ఉపయోగించేందుకు అనుమతులు జారీ చేసింది. ప్రస్తుతం ఇంటి నిర్మాణాలకు కూడా ఇసుక తరలించేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో పాలేరు వాగు నుంచి ఇసుక బుక్ చేసుకుంటున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు ఆన్‌లైన్ పేరుతో ఎక్కువ ట్రిప్పుల ఇసుకను తరలిస్తుంగా, పలువురు సెలవు దినాల్లో కూడా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

అందుబాటులో 'మన ఇసుక వాహనం'..

ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మన ఇసుక వాహనం అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని పొందవచ్చు. స్థానికంగా ఉన్న వాగుల్లో ఇసుకను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మైనింగ్ శాఖలో నమోదు చేసుకున్న ట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వం ఇసుకను సరఫరా చేస్తుంది. ఈ విధానంతో అక్రమ ఇసుక రవాణాకు ఒకింత అడ్డుకట్ట పడినట్లు అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోవాలి

ఇసుక కావాలంటే 'మన ఇసుక వాహనం' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. ట్రక్కు ఇసుక 1 నుంచి 10 కిలోమీటర్ల దూరానికి రూ.2300 ఉంటుంది. 10 కిలోమీటర్లు దాటితే ఒక్కో కిలో మీటరుకు రూ.75 చెల్లించాల్సి ఉంటుంది. మండలంలో అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె.హిమబిందు, తహసీల్దార్, అనంతగిరి

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే అనేక ట్రాక్టర్లను సీజ్ చేశాం. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేసి మైనింగ్ అధికారులకు అప్పగిస్తున్నాం.

– ఎస్సై, నవీన్‌కుమార్, అనంతగిరి

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల


మునగాల : పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది


నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను జిల్లా సహాయ ఎన్నికల అధికారి, స్థానిక ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన అఖిల పక్ష పార్టీల నాయకుల సమావేశం నిర్వహించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. 15వ తేదీన పోలింగ్ స్టేషన్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ హరిసింగ్, సుపరింటెండెంట్ విజయనిర్మల, సీనియర్ అసిస్టెంటు చంద్రకళ, సిబ్బంది కోటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

మునగాలలో..

మునగాల : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మంగళవారం మునగాల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 13న రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, కార్యదర్శులకు సమావేశం నిర్వహిస్తున్నామని, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. అభ్యంతరాలుంటే సరిచేసి తుది జాబితాను ఈనెల 15వ తేదీన ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎండి. యాసిన్, జూనియర్ అసిస్టెంట్ జూకూరి కిరణ్‌కుమార్, సిబ్బంది కమల, సుల్తాన పాల్గొన్నారు.

మోతెలో..

మోతె : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాను బుధవారం మోతె మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ విజయకుమారి మాట్లాడుతూ.. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13 వరకు తమకు తెలియపరచాలని తెలిపారు. ఈ నెల 15న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చౌటపల్లిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, అష్టోత్తర కలశ స్నపన, మన్యసూక్త హోమం, బలిహరణ, సుదర్శన మూలమంత్ర హోమం, విష్ణుసహస్ర నామ పారాయణం, నీరాజన మంత్ర పుష్పం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ సిగారపు సైదులు, ఈఓ నాగెళ్ల శంభిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పశువులకు పచ్చి గడ్డి అందించాలి

- జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

మేళ్లచెరువు : పాడి రైతులు పశువులకు క్రమం తప్పకుండా పచ్చి గడ్డి అందించాలని, తద్వారా పశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా పశు వైద్యాధికారి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మేళ్లచెరువులో స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పశువులు, మేకలు, గొర్లు, పెంపుడు కుక్కలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పద్మాగోవిందరెడ్డి, పరిశ్రమ సీజీఎం నాగేశ్వరరావు, ఏజీఎం శ్రీనివాస్, రత్నం, పశు వైద్యులు శ్రీనివాసరెడ్డి, రూప్‌కుమార్, శైలజ, మధునాయక్, సత్యవతి, శ్రావణి, గోపాలమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.


పాడిరైతులకు మందులు అందజేస్తున్న జిల్లా పశువైద్యాధికారి, పరిశ్రమ అధికారులు

నేడు సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం


స్వామివారిని పల్లకీలో ఫణిగిరి గుట్టపైకి తీసుకెళ్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో శ్రీవేణుగోపాల, శ్రీసీతారామచంద్రస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 12వ తేదీ (బుధవారం) నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పరికల రామస్వామి గట్టుపై ఉన్న స్వయంవ్యక్త శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం వద్ద 12న రాత్రి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరపనున్నారు. మంగళవారం వేణుగోపాల సీతారామచంద్రస్వామివార్లను పల్లకీలో ఫణిగిరి గుట్టపైకి చేర్చారు. ఈ సందర్భంగా 12న సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి ఎదుర్కోళ్ల మహోత్సవం, స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారు. 13న హోమం, బలిహరణ, ప్రసాద వితరణ ఉంటుంది. రాత్రి గరుడవాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 14న చక్రవరి సేవాకాలం, రాత్రి దోపోత్సవం, ఆశీర్వచనం, పూర్ణాహుతి, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, కళాప్రదర్శనలు ఉంటాయి. 15న రాత్రి స్వామివారు పట్టణ ప్రవేశం, పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు అనంతరం ఆలయ ప్రవేశం చేస్తారు. 16న ప్రాబోధికి, నివేదన, రాత్రి హరికథా గానం, హరినామ సంకీర్తనలు, పవళింపు సేవ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ, అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

మట్టపల్లి ఆలయంలో విశేష పూజలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో మంగళవారం విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. ఇందులో భాగంగా సుప్రభాతసేవ, నిత్యహోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రసరమ్యంగా రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాబాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

చిలుకూరు : మండల కేంద్రంలో శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు

కరాటే పోటీల్లో ప్రతిభ

సూర్యాపేటటౌన్ : కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందిన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పాఠశాలలో ప్రిన్సిపాల్ బి.లావణ్య సన్మానించి మాట్లాడారు. హైదరాబాద్ వరల్డ్ నాకాయామ చోటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నేషనల్ లెవల్ మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించగా అందులో తమ పాఠశాల విద్యార్థులు 6 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్, 1 బ్రాంజ్ మెడల్ సాధించారని ఆమె తెలిపారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం


ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్- లావణ్య దంపతులు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని గోపాలపురంలో గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రసరమ్యంగా రక్తికట్టించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ గావించారు. ఈ మహోత్సవంలో హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్- లావణ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదులు, మాజీ ఎంపీటీసీ చీకూరి రాజారావు, కాల్వ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడిపై దాడి అమానుషం

నేరేడుచర్ల : చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి అమానుషమని దూప, దీప, నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంబోట్ల ఫణికుమారశర్మ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి నిత్యం దైవ సేవలో ఉంటూ సర్వేజన సుఖినోభవంతు అని ఆశీర్వదించే అర్చకుల మీద హింసపూరితంగా దాడి చేయడం హేయమైన చర్య అని, ఆ దాడిని ఖండిస్తున్నామని అన్నారు. ఈ విషయంపై యావత్ అర్చక లోకం ఖండించాలన్నారు. నిత్యం చిలుకూరు బాలాజీ దేవాలయంలో రంగరాజన్ దైవ సేవతో పాటు అర్చకుల సంక్షేమ కోసం, హిందూ ధర్మం, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు, అధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునారవృతం కాకుండా చూడాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

'టోల్ రుసుం పేరుతో ఆర్టీసీ దోపిడీ'

నేరేడుచర్ల : టోల్ రుసుం పేరుతో ఆర్టీసీ సంస్థ దోపిడీకి పాల్పడుతుందని, నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడకు 14 కిలో మీటర్ల దూరానికి 40 రూపాయల టికెట్ వసూలు చేయడం అన్యాయమని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా 14 కిలో మీటర్ల దూరానికి టికెట్ 40 రూపాయలు వసూలు చేస్తుండడంతో సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాత టోల్ గెట్ ఉన్నప్పుడు అదనంగా రూ. 10 మాత్రమే వసూలు చేశారని, కానీ ప్రస్తుతం రోడ్డు విస్తరణలో భాగంగా కొత్త టోల్ గేటు నిర్మించడంతో ఆర్టీసీ రూ. 40 రూపాయాలు టికెట్ తీసుకుంటున్నట్లు తెలిపారు. టికెట్ రేట్లు తగ్గించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషిచేయాలి


మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్

మఠంపల్లి : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. నిక్షయ్ శిబిర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పెదవీడులో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ అనుమానితులు తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కాగా, ఈ శిబిరంలో 88 మందికి తెమడ పరీక్షలు, ఎక్స్‌రే, క్షయ నిర్ధారణకు తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల హెచ్‌ఈఓ ప్రభాకర్, సూపర్‌వైజర్లు రవి, నాగేంద్రమ్మ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ మమత, ఎల్‌హెచ్‌పీ అదిలక్ష్మి, ఎల్‌టీ రమేష్, ఏఎన్‌ఎం సీతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు బెల్లంకొండ శ్రీనివాసరావు, భాస్కర్, జిల్లా టీబీ యూనిట్ అధికారులు ప్రసాద్, మాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో రైతు ఆత్మహత్యలు పెరిగాయి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్

గరిడేపల్లి : బీజేపీ పదేళ్ల పాలనలో రైతు ఆత్మహత్యలు పెరిగాయని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో యానాల సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఈ దేశానికి అన్నం పెట్టే రైతన్న చేసే వ్యవసాయానికి సబ్సిడీలు మొత్తం ఎత్తేసి బీజేపీ ప్రభుత్వం కార్పొరేటు వైపు మొగ్గు చూపుతుందని ఆరోపించారు. రైతాంగానికి ఉత్పత్తికయ్యే ఖర్చు కంటే మరో 50 శాతం కలిపి ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు చేస్తే అది చెత్తబుట్టలో పడేశారని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా మాటలకే పరిమితమైందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య, వెంకటేశ్వర్లు, మండల సైదులు, సారెడ్డి సైదిరెడ్డి, యానాల సోమయ్య, యానాల సుశీల, రాయిరాల శ్రీనివాస్, బొల్లెపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న అధికారులు


మట్టి తవ్వకాలను అడ్డుకున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

పాలకవీడు : మండలంలోని మూసీఒడ్డుసింగారం శివారులో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టిని అనుమతులు లేకుండా గ్రామాల మీదుగా భారీ వాహనాలతో తరలిస్తున్నారన్న సమాచారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపిన, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుహాసిని, జిల్లా మైనింగ్ శాఖ సాంకేతిక సహాయకుడు వెంకన్న, ఏఆర్ఐ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి, గోపాలపురంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రీఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, స్వామివారికి అలంకరణ అనంతరం పంచామృతాలతో అభిషేకం చేశారు. గంధసింధూరం, ఆకుపూజ నిర్వహించారు. బూరుగడ్డ ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఆయా ఆలయాల ఈఓలు ఎంపి లక్ష్మణరావు, చలపతి, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, నర్సింహాచార్యులు, అన్వేష్‌కుమార్‌చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

హుజూర్‌నగర్ : శ్రీసేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ ఏర్పాటు కోసం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. డివిజన్‌లోని అన్ని గిరిజన సంఘాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు హాజరు కావాలని కోరారు.

రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో గల శ్రీరంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ, అభిషేకాలు, శాంతి హోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తాళ్లూరి రమేష్, ప్రధాన అర్చకులు పల్లప్రోలు నర్సింహాచార్యులు, వేదాంతం చక్రధరాచార్యులు, రంగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండలంలోని కరివిరాల, సిరిపురం గ్రామాల్లో బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరివిరాల, సిరిపురం సబ్‌స్టేషన్‌ల నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యే ఫీడర్ చానళ్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఆంజనేయస్వామికి పూజలు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు. సహస్రనామార్చన, నాగవల్లి దళాలతో పూజలు చేశారు. అనంతరం ఆరగింపు మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కొంకపాక మృత్యుంజయ శాస్త్రి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న మార్కెటింగ్ మేనేజర్ శివ

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ పిడమర్తి గురవయ్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో మంగళవారం ఖమ్మం ప్రసున హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బాల భాస్కర్‌రెడ్డి పంపిన రూ. 20వేలు ఆర్థికసాయాన్ని మార్కెటింగ్ మేనేజర్ శివ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లికంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణచారి, కోశాధికారి పూర్ణచారి, సోషల్ మీడియా అధ్యక్షుడు మచ్చ రమేష్, ఆర్గనైజింగ్ డైరెక్టర్స్ వీరస్వామి, శ్రీనివాస్, భిక్షం, సైదాబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొట్టాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

మోతె : పశువుల కొట్టాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని మోతె ఏపీఓ నగేష్ అన్నారు. మంగళవారం మండలంలోని రావిప హాడ్, సిరికొండ గ్రామాల్లో ఆయన పశువుల కొట్టాల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఫిబ్రవరి 20వ తేదీ వరకు కొట్టాల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. మండలంలో నర్సరీల నిర్వహణ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. నర్సరీల్లో మొక్కలను పూర్తి స్థాయిలో సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట ఈసీ శ్రీహరి, టీఏ రామయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మామిడి లక్ష్మి, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


చిలుకూరులో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండల కేంద్రంలో కాలువ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొల్లు సత్యనారాయణ లక్ష్మీ దంపతులు సహకరించగా, గ్రామానికి చెందిన అలసకాని శ్రీను, పద్మ దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రజినీకాంత్ ఆచార్యులు, ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం హుజూర్‌నగర్ నూతన ప్రెస్ క్లబ్ (టీయూడబ్ల్యూజే) బ్రోచర్‌ను ఆర్డీఓ శ్రీనివాసులు.. డీఏఓ రాజేందర్ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పిల్లలమర్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జానీపాషతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎస్.నరేందర్ రెడ్డి, బసవోజు శ్రీనివాసచారి, దేవరం రామ్‌రెడ్డి, ఆర్‌పీ గౌడ్ కీతా రామనాథం, ఇందిరాల రామకృష్ణ, కోమరాజు అంజయ్య, రామకృష్ణ, మీరా, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులస్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై మంగళవారం పట్టణంలోని యాదవ్ బజార్‌లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాఘ మాసంలో వచ్చే పండుగలు, వాటి విశిష్టతలను ప్రజలకు వివరించారు. జ్ఞానాన్ని తెలుసుకుని ఆచరించినవాడే యోగి అవుతాడని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వర్లు, బి.వీరన్న, జె.శివ రామకృష్ణ, ఎం.శైలజ, వి.మహేష్, విజయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సెక్కండి.. బహుమతి పొందండి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ నుంచి విజయవాడకు డీలక్స్ బస్సులను ఎక్కి బహుమతులు పొందాలని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ భారతీబాయి అన్నారు. డిపో నుంచి విజయవాడకు వెళ్లిన ప్రమాణికులకు సంబంధించి గిఫ్ట్ బాక్స్‌లో వేసిన టికెట్లకు లక్కీ డ్రా తీసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డిపో నుంచి విజయవాడకు డిలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్ రాసి డ్రైవర్ వెనుక భాగంలో ఉన్న గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ఎంఎఫ్ యాదగిరి, జి. యాదగిరి పాల్గొన్నారు.